విలీన గ్రామాల్లో ఎన్నికలు జరిగేనా?

- ఆరేళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలోనే పలు గ్రామాలు
- ఎన్నికల వాయిదాతో ఆందోళన
- పంచాయతీలుగా కొనసాగించాలని గ్రామస్తుల డిమాండ్



కుందనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

రామగుండం: గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు జనవరి 31తో ముగుస్తున్నందున త్వరలోనే సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తొలుత ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల పాలకవర్గాల్లో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు ఖరారైన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. కాగా పంచాయతీల్లో ఫిబ్రవరి నుంచి మే వరకు ప్రత్యేకాధికారుల పాలన ఏర్పాట్లకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. ఫలితంగా ఇప్పటికే ఆరేళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్న కుందనపల్లి, లింగాపూర్ గ్రామాల్లోని ఆశావహుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో నిరుత్సాహానికి గురయ్యారు.

విలీన గ్రామస్తుల్లో ఉత్కంఠ..

కార్పొరేషన్‌కు అతి సమీపంలోనే ఉన్నాయనే కారణంతో పలు గ్రామాలను రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి, లింగాపూర్, రామగిరి మండల పరిధిలోని వెంకట్రావుపల్లి, పాలకుర్తి మండల పరిధిలోని ఎల్కలపల్లి పంచాయతీ పరిధిలోని ఆరు వార్డులున్నాయి. వీటిని మినహాయించి మిగతా గ్రామ పంచాయతీలకు ఎన్నికల తంతు పూర్తి చేశారు. కాగా విలీనంతో గ్రామీణ ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, పలు రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. గ్రామాల విలీనం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, విలీనం అంటే ప్రజల హక్కులను బలవంతంగా కాలరాయడమేనని వీటిపై తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని తీర్పును వెలువరిస్తూ పిటిషన్లను కొట్టివేసింది. ఆ సమయంలోనే సాధారణ ఎన్నికలు జరగడంతో రామగుండం ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్ గెలుపొందగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి డీనోటిఫై చేయించి విలీన ప్రక్రియకు బ్రేక్ వేయించారు.

పలుమార్లు ఉప ఎన్నికలకు కసరత్తు..

కాగా అప్పటికే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఆరునెలల తర్వాత ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ సమయంలో ప్రతిపాదిత విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత గతేడాది ఏప్రిల్‌లో సదరు విలీన గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. మళ్లీ పలు సాంకేతిక కారణాలతో అకారణంగా ఎన్నికల ప్రక్రియ మరుగునపడింది. ఈసారైనా సదరు గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీలుగానే కొనసాగించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రతిపాదనలను రద్దు చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే సమయంలో మా గ్రామాలకు కూడా ఎన్నికలు నిర్వహించాలి. విలీనంతో గ్రామీణ ప్రజలు ఉపాధి పనులకు దూరం అయ్యారు. అంతేకాకుండా పన్నుల భారంతో ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు పడనున్నారు.

– ఇరికిళ్ల శంకరయ్య, లింగాపూర్

వాయిదాతో నిరుత్సాహం



సుమారు ఆరేళ్లుగా మా గ్రామ పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఖరారు చేయనున్నామనే ప్రకటనతో 6నెలలు ప్రత్యేకాధికారుల పాలనకు నిర్ణయం తీసుకొన్నారు. అసలు ఎన్నికలు నిర్వహిస్తారా.. సాంకేతిక కారణాలతో నిలిపివేస్తారా అనే సందిగ్ధత నెలకొంది.

– రవి, కుందనపల్లి

బౌద్ధస్తూపం సందర్శనలో ఎస్సారార్ విద్యార్థులు



ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు

ఎలిగేడు: ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ చరిత్ర విభాగం జిజ్ఞాస, విజ్ఞాన విహార యాత్రలో భాగంగా కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విభాగం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని సందర్శించారు. జిజ్ఞాస ప్రాజెక్టు కరీంనగర్–ఏ క్రెడిల్ ఆఫ్ శాతావాహన అనే ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు, అధ్యాపక బృందం ఫీల్డ్ ట్రిప్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా చరిత్ర విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధాకర్ మాట్లాడుతూ మన ప్రాచీన తెలుగు ప్రజల చరిత్ర ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రారంభమైందన్నారు. తెలుగు ప్రజలకు మొదటి పాలకులు శాతావాహనులని, వారి పరిపాలన కేంద్ర బిందువు కోటి లింగాలేనని పేర్కొన్నారు. ధూళికట్ట బౌద్ధస్తూపం క్రీస్తు పూర్వం 2200 ఏళ్ల క్రితం నాటిదని వివరించారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ అధ్యాపక బృందాన్ని, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మ్యూజియం టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ, అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ్, రామకిషన్, రాజేందర్, చౌకీదార్ ఎర్ర పద్మాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కార్పొరేటర్



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శంకర్ నాయక్

యైటింక్లయిన్‌కాలనీ: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌బాబును రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్‌నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా కారదర్శి వీరారెడ్డి, కాలనీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హరిహర నాయక్, అఖిల్ ఉన్నారు.

లొంకకేసారం సర్పంచ్

రామగిరి: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును లొంకకేసారం సర్పంచ్ ఎండీ మంజూర్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు. లొంకకేసారం గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని గ్రామ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కల్వచర్ల మాజీ సర్పంచ్ దేవ రామస్వామి, ప్రదీప్ ఉన్నారు.

అర్హులైన అభ్యర్థులకు అవకాశం కల్పించాలి



పుష్పగుచ్ఛం ఇస్తున్న మద్దెల దినేశ్, శ్రీకాంత్

జ్యోతినగర్/కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మెడికల్ కళాశాలలో వారధి ద్వారా నియమించనున్న ఖాళీల భర్తీలో అర్హులైకు అవకాశం కల్పించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, ప్రధాన కార్యదర్శి గడప శ్రీకాంత్ జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి విన్నవించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లోని ఆర్వో కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రామగుండంలో పేరుకుపోయిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించారని, స్థానిక సమస్యలపై త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్



స్పీకర్‌తో ఎంఎస్ రాజ్‌ఠాగూర్, మంత్రులు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ శుక్రవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి స్పీకర్‌ను కలిశారు. ఆయన వెంట పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఉన్నారు.

రామగుండం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జ్యోతి

రామగుండం: మండల తహసీల్దార్‌గా శుక్రవారం ఎం.జ్యోతి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. కాగా రామగుండం డిప్యూటీ తహసీల్దార్ ఎం.తిరుపతి పూర్తి స్థాయి బాధ్యతలు తీసుకున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్ గ్రామంలో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.


ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న మణిశర్మ

ధర్మారం: ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన చిప్ప మణిశర్మ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

మియావాకీ పద్ధతిలో నర్సరీ ఏర్పాటు చేసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: నర్సరీలను మియావాకీ పద్ధతి ద్వారా ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న మార్కండేయ కాలనీలో నర్సరీని సందర్శించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. మియావాకీ పద్ధతి ద్వారా మొక్కల సంరక్షణ చేస్తే బాగుంటుందని తెలిపారు.

సహకారశాఖ నాన్ గెజిటెడ్ కార్యవర్గం ఎన్నిక



పెద్దపల్లిరూరల్: తెలంగాణ సహకార శాఖ పెద్దపల్లి జిల్లా నాన్ గెజిటెడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బొంకూరి శంకర్, సహకార శాఖ అధ్యక్షుడిగా మహమ్మద్ ముఫాస్సిర్ అహ్మద్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సందీప్‌రావు, సురేశ్ ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పెళ్లికి వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి ఎస్సై అప్పగించారు. ఎస్సై వెంకటేశ్ మాట్లాడుతూ యాద్రాది భువనగిరికి చెందిన వరికుప్పల నరేశ్ నెలక్రితం పెద్దపల్లిలోని మారేడుపల్లిలో పెళ్లికి వచ్చి తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అతడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పోయిన ఫోన్‌ను గుర్తించి తిరిగి బాధితుడికి అందజేశామన్నారు.

ఆంగ్ల బోధనపై పట్టు సాధించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూలపల్లి: ఆంగ్ల బోధనలో పట్టు సాధించి విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధనకు 'ఉన్నతి' అవగాహన కార్యక్రమం ఉపయోగపడుతుందని డీఆర్పీ రఘురాం శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో సుల్తానాబాద్, ఎలిగేడు, ధర్మారం, జూలపల్లి నాలుగు మండలాల ఆంగ్లబోధన ఉపాధ్యాయులకు ఉన్నతి కార్యక్రమంలో బోధనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోధనలో సులభతర విధానంపై వివరించారు. ఎంఎస్‌వో సరస్వతి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఆర్పీ వీరమల్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడిబయట పిల్లల సర్వే



పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల, ఆకెనపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)లు బడిబయట ఉన్న పిల్లల వివరాలను సేకరించారు. ముఖ్యంగా 6 నుంచి 19 ఏళ్ల మధ్య వయసులో ఉన్న బడిబయట ఉన్న పిల్లలతో పాటు 30రోజుల పాటు పాఠశాలకు గైర్హాజరయ్యే వారి వివరాలను సేకరించి నేరుగా వారితో మాట్లాడి అవగాహన కల్పించారు. బడిబయట ఉన్న పిల్లల వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో మద్దిర్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేశ్‌కుమార్, జెడ్పీహెచ్‌ఎస్ పొట్యాల ఉపాధ్యాయుడు బి.పోచయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి తీగుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఎమ్మెల్యేకు ఆశీర్వచనం ఇస్తున్న పూజారి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సునీత, నాయకులు రాజేందర్, సారయ్య, రాజిరెడ్డి, సత్యనారాయణ, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ షూటింగ్ రేంజ్‌లో శనివారం, ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు అక్షిత, కౌశిక్ అండర్–14, 17 విభాగాల్లో ఎంపికైనట్లు హెచ్ సురేంద్రకుమార్ తెలిపారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీ: గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కరీంనగర్ ఆశాజ్యోతి కేర్ సపోర్ట్ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం స్థానిక సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చేయూత అందించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీతో, నిస్సహాయ చిన్నారులకు పౌష్టికాహారం, రగ్గులను స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోత్స్న చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సేవాస్ఫూర్తిని అభినందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల సలహాదారులు దయానంద్‌గాంధీ, స్కూల్ ఎన్‌సీసీ అధికారి జ్యోత్స్న, టీచర్లు విజయ, పద్మ, కరీంనగర్ ఆశాజ్యోతి ప్రతినిధులు లిటిల్, లావణ్య, జ్యోతి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహాపడిపూజలో అయ్యప్ప స్వాములు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. 39వ డివిజన్ గౌతమినగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు రాపల్లి మురళీధర్ శర్మ, లక్ష్మీనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజ మహోత్సవం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మల్లేశం

పెద్దపల్లిరూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై మల్లేశం అన్నారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లు ఎక్కువగా వాడడంతో సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయని, దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైత్రేయి, ఎన్ఎస్ఎస్ పీవో నరహరి తదితరులు ఉన్నారు.

1930కు ఫిర్యాదు చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: సైబర్ క్రైం నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే డయల్ 1930కు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాల్సిన అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లారెడ్డి, కానిస్టేబుల్స్ స్నేహలత, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమాన్‌పూర్: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, గంజాయి, షీటీం పనితీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ సీఐ అఫ్జల్, కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు అన్నారు. మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో కమాన్‌పూర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసు కళాజాతను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై కళాజాత బృందం ప్రజలకు వివరించారు.

భవన నిర్మాణ కార్మికుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న చిలువేరి స్వామి

రామగిరి: గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా భవన నిర్మాణ కార్మికుల హామీలను అమలు చేయాలని జిల్లా అధ్యక్షుడు చిలువేరి స్వామి అన్నారు. శుక్రవారం మండల భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జిల్లాకు ఒక కార్మిక భవనం కట్టిస్తామని, కార్మికులకు బైకులు పంపిణీ చేస్తామని హామీలు ప్రకటించి మర్చిపోయారన్నారు. నూతన ప్రభుత్వంలో కార్మికులకు న్యాయం చేయాలని, ప్రత్యేక ఆసుపత్రులు, పాఠశాలలు కట్టించి కార్పొరేట్ వైద్యం, విద్య అందించాలని డిమాండ్ చేశారు. 55ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.5వేల పెన్షన్ అందజేయాలని, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. జిల్లా కోశాధికారి ఎస్కే షరీఫ్, బైరి శంకర్, సురేశ్, సంపత్, రాములు, భూమయ్య, మల్లయ్య, సమ్మయ్య, సారయ్య, విష్ణువర్ధన్, ప్రభాకర్, రాయమల్లు, సంతోష్ పాల్గొన్నారు.

రేపు సాధన జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మారం: మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాలలో 17న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గజనవేని కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, పీజీ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులు ఉండవన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 80744 42121 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రక్షణ చర్యలు పటిష్టం చేయాలి

- డీజీఎంఎస్ ప్రభాత్‌కుమార్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభాత్‌కుమార్



మహిళా టీంను అభినందిస్తున్న అతిథులు

గోదావరిఖని: గనుల్లో రక్షణ చర్యలు తీసుకోవడంపై మరింత పకడ్బందీగా ముందుకు సాగాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) ప్రభాత్ కుమార్ సూచించారు. శుక్రవారం రామగుండం రీజియన్ మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో జరిగిన 52వ ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గనుల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో కీలకంగా వ్యవహరించే రెస్క్యూ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈపోటీలను స్ఫూర్తిగా తీసుకుని కొత్తసవాళ్లను అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. తొలిసారి ఆలిండియా రెస్క్యూ పోటీల్లో పాల్గొన్న మహిళా బృందానికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్‌సింగ్, డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌వీకే శ్రీనివాస్, డీఎంఎస్ శ్యాంమిశ్రా, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మంథని మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ

మంథని: మున్సిపల్ కమిషనర్ సతీశ్ బదిలీ కాగా నూతన కమిషనర్‌గా రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న బాలకృష్ణను నియమించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని: మంథని, గుంజపడుగు, నాగారం విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సరఫరా ఉండదని ఏఈఈ మల్లయ్య తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతు పనుల దృష్ట్యా సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధి పశువుల కొట్టాలను వినియోగించుకోవాలి

ఓదెల: ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తున్న పశువుల కొట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు పిట్టల సరిత కోరారు. శుక్రవారం మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లెలో ఉపాధిహామీ పథకంలో మంజూరైన పశువుల నివాసం కోసం పనులను ఆమె ప్రారంభించారు. టీఏలు జనార్దన్, నాయక్, రైతులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జ్యోతినగర్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎన్టీపీసీ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఎస్సై బి.జీవన్, సిబ్బంది మల్లికార్జున్, అంజితో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల ర్యాలీ

రామగిరి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని నాలుగు రోజులుగా గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నారు. సమ్మెలో భాగంగా శుక్రవారం సెంటినరీకాలనీ తపాలా కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి డివిజన్ సెక్రటరీ శంకరయ్య, మండల అధ్యక్షుడు వనం రవీందర్‌రావు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: డిమాండ్లు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. యూనియన్ నాయకులు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, అలీ, శివ, అజయ్, ఆమని, చందు, చోటేమియా, రాజబాబు, వెంకటేష్, సంతోష్, సత్తయ్య పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసుల్లో సిబ్బంది తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన సమ్మెతో సేవలు నిలిచిపోయాయి. ఎలిగేడు పోస్టాఫీసు పరిధిలోని 12 కార్యాలయాల్లో సిబ్బంది సమ్మెతో సేవలు నిలిచిపోయాయి.